## నిఖత్‌జరీన్‌కు అర్జున అవార్డు రావడం హర్షణీయం : సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ప్రపంచ మహిళా బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్‌కు 'అర్జున అవార్డు' రావడం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సిఎంఒ కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మహిళా బాక్సింగ్‌లో వరుస విజయాలను నమోదు చేస్తూ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచి దేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన నిఖత్ జరీన్ అర్జున అవార్డుకు నూటికి నూరు శాతం అర్హురాలని పేర్కొన్నారు. యావత్ భారత జాతి తెలంగాణ బిడ్డ ప్రతిభను చూసి గర్విస్తోందని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా నిఖత్ జరీన్‌కు అభినందనలు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు.

## సిఎస్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎల్‌బినగర్ ప్రతినిధులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ఎల్‌బినగర్ నియోజకవర్గంలోని 33 కాలనీలకు చెందిన ఇండ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలుగా ఉత్తర్వులు జారీ చేసినందుకు కాలనీల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో 33 కాలనీల ప్రతినిధులు బిఆర్‌ఎస్‌కె భవన్‌లో సిఎస్ సోమేశ్‌కుమార్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

## 21న ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవం

- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవం ఈ నెల 21న జరగనుంది. దానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులు కెటిఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు, టిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## పథకాలలో ప్రజలను భాగస్వామ్యం చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ల బాధ్యత గురుతరమైంది : సిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా ప్రజలను భాగస్వామ్యం చేయడంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ల బాధ్యత గురుతరమైనదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ అన్నారు. ఇటీవల పలు జిల్లాలలో పోస్టింగ్‌లు పొందిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు తమ రెండు రోజుల శిక్షణ బుధవారం పూర్తయ్యింది. ఈ సందర్భంగా బిఆర్‌కె భవన్‌లో వారితో సిఎస్ సోమేశ్ కుమార్ సమావేశమయ్యారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, శశ్మాన వాటికలు, గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, హరితహారం తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల, పట్టణాల పర్యటనలకు వెళ్లే ముందు సమస్యలపై పట్టు సాధించాలనీ, సమస్యల పరిష్కారం దిశలో విస్తృతంగా పర్యటనలు చేయాలని దిశానిర్దేశం చేశారు. కేవలం ఉత్తర ప్రత్యుత్తరాలకే పరిమితం కాకుండా పనిలో ప్రగతి చూపాలనీ, స్థానిక ప్రజలతో మమేకం కావడంతోపాటు భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ పరిపాలన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, పంచాయతీ రాజ్ కార్యదర్శి సందీప్ సుల్తానియా, మున్సిపల్ శాఖ డైరెక్టర్ సత్య తదితర అధికారులు పాల్గొన్నారు.

# 'క్యాసినో' కేసు

- మంత్రి తలసాని బ్రదర్స్‌నే విచారించిన ఇడి
- ఎమ్మెల్సీ ఎల్.రమణ, డిసిసిబి చైర్మన్ దేవేందర్‌రెడ్డిలకూ నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో సంచలనం రేపిన చికోటి ప్రవీణ్ క్యాసినో కేసులో రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇద్దరు సోదరులు తలసాని ధర్మేంద్ర యాదవ్, తలసాని మహేశ్ యాదవ్‌లను బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుదీర్ఘంగా విచారించారు. నేపాల్, శ్రీలంకలో చికోటి ప్రవీణ్ నిర్వహించిన క్యాసినోలతో సంబంధాలు కలిగి ఉన్నారనే ఆరోపణపై మంత్రి సోదరులిద్దరిని విచారణకు పిలిచింది. ఉదయమే ఈడీ కార్యాలయానికి చేరుకున్న ధర్మేంద్ర, మహేశ్‌లను ఈడీ చెందిన ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ బృందం ప్రశ్నించినట్టు తెలిసింది. రాత్రి 7.30 గంటల వరకు కూడా వీరిద్దరినీ ఈడీ విచారించింది. ముఖ్యంగా, నేపాల్‌లో నిర్వహించిన క్యాసినోకు హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున ప్రముఖులను సమీకరించి చికోటి ప్రవీణ్ తరలించాడని ఈడీకి ఆధారాలు దొరికిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా

హైదరాబాద్‌లోనే కోట్లాది రూపాయలను క్యాసినోలో ఆడటానికి డబ్బులను సేకరించి నేపాల్‌కు మనీ లాండరింగ్ ద్వారా చికోటి తరలించినట్టు ఈడీకి సమాచారమున్నది. ఇందులోనే ధర్మేంద్ర, మహేశ్‌లకు కూడా సంబంధాలున్నట్టు ఈడీ విశ్వసిస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఇద్దరిని పిలిపించిన ఈడీ అధికారులు నేపాల్‌లో జరిగిన క్యాసినోతో వీరికి ఉన్న సంబంధాల గురించి ఆరా తీసినట్టు తెలిసింది. ఏ మేరకు డబ్బులు చేతులు మారాయి? ఆ డబ్బులను ఏ విధంగా నేపాల్‌కు తరలించారు? ఇందులో మనీలాండరింగ్ నిబంధనలను ఉల్లంఘించారా? లేదా? తదితర కోణాలలో గుచ్చి గుచ్చి ప్రశ్నించినట్టు తెలిసింది. కాగా, ఇదే క్యాసినో కేసుకు సంబంధించి టిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎల్. రమణతో పాటు డిసిసిబి చైర్మన్ దేవేందర్‌రెడ్డిలకు కూడా ఈడీ అధికారులు నోటీసులను పంపించినట్టు సమాచారం. వీరిద్దరిని కూడా ఒకట్రెండ్రోజుల్లో పిలిచి ఈడీ అధికారులు విచారించే అవకాశమున్నదని తెలిసింది. ఒక పక్క, ఢిల్లీ లిక్కర్ స్కామ్ మరొకపక్క, శ్వేత తదితర కంపెనీల అక్రమ గ్రానైట్ ఎగుమతులకు సంబంధించి విచారణను సాగిస్తూ రాష్ట్రంలో హల్‌చల్ చేస్తున్న ఈడీ అధికారులు మరోసారి నేపాల్ క్యాసినో కేసుకు సంబంధించి చికోటి ప్రవీణ్ ఉదంతంపై లోతుగా దర్యాప్తును సాగిస్తున్నట్టు తెలిసింది.

## ఆర్‌టిసి ఉద్యోగుల పిఆర్‌సికి ఆలస్యమెందుకు?

- ప్రభుత్వానికి టిజెఎమ్‌యు ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ఆర్‌టిసి కార్మికుల పిఆర్‌సికి అనుమతి ఇమ్మని ఎలక్షన్ కమిషన్‌ను కోరిన ప్రభుత్వం, ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉందని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టిజెఎమ్‌యు) ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్లు వేయించుకోవడానికే లేఖ రాసారా అంటూ పత్రికా ప్రకటనలో ఎద్దేవా చేశారు. మునుగోడు ఎన్నికల సమయంలో ఆర్‌టిసి కార్మికుల ఓట్ల కోసం హడావిడి చేసిన మంత్రులు తారకరామారావు, హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఇప్పుడు ముఖ్యమంత్రిని ఎందుకు ప్రశ్నించలేకపోతున్నారన్నారు. 16 నెలల క్రితం 9 లక్షల 18 వేల మంది రాష్ట్ర ఉద్యోగులకు పిఆర్‌సి ఇచ్చిన ప్రభుత్వం కేవలం 48 వేల మంది ఉన్న ఆర్‌టిసి ఉద్యోగులకు వేతన సవరణ చేయకపోవడం దుర్మార్గమని విమర్శించారు. తక్షణం రెండు వేతన సవరణలు చేసి, ఆర్‌టిసి కార్మికుల ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## సినీకళామతల్లికి నుదుట తిలకం కాంతారావు : సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
తెలుగు సినీ కళామతల్లికి ఎన్‌టిఆర్, ఎఎన్నార్‌లు రెండు కండ్లయితే, నుదుట తికలంగా కాంతారావు ఖ్యాతి గడించడం తెలంగాణకే గర్వకారణమని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ప్రఖ్యాత నటుడు, రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహీత, తెలంగాణ బిడ్డ కాంతారావు (తాడేపల్లి లక్ష్మీకాంతారావు) 99వ జయంతి (నవంబర్ 16) సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆయనకు నివాళులు అర్పించారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం గుడిబండ అనే మారుమూల గ్రామం నుంచి తెలుగు చలన చిత్ర పరిశ్రమలోకి వచ్చిన కాంతారావు 400కుపైగా పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల్లో నటించారనీ, సినీ కళారంగానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని స్మరించుకున్నారు.

## వాగ్దానాల అమలుకు మహిళలు ఉద్యమించాలి

- ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డివిరిస్తున్న బిజెపి
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎనిమిదేండ్ల కాలంలో ప్రజలకిచ్చిన హామీల అమలుకు మహిళలు ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ.. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం చిన్నగోపతి గ్రామంలో 'వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర-ప్రభుత్వాల వైఖరి' అంశంపై సంఘం మండల అధ్యక్షులు బొలమాల యోహన్ అధ్యక్షతన సెమినార్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెంచడంతో పేదలపై పెద్ద ఎత్తున భారం పడిందన్నారు. దేశంలో 76 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, 1.50 కోట్ల మంది వ్యవసాయ కూలీలు ఉన్న దేశంలో బిజెపి అవలంబిస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాలతో ఆ రంగం పూర్తిగా దెబ్బతింటుందని ఆరోపించారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో వామపక్ష పార్టీల ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసేలా పని దినాలను కుదిస్తూ, బడ్జెట్‌లో కోత విధిస్తోందని విమర్శించారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ పరిపాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పార్లమెంట్‌లో మహిళా రక్షణ చట్టం అమలు చేసి, చట్టసభల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. రాష్ట్రంలో టిఆర్‌ఎస్ ప్రభుత్వం సైతం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో ఖమ్మంలో జరిగే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడోవ మహసభను జయప్రదం చేయాలని తెలిపారు. అనంతరం గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య వీరభద్రం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడారు.

## నిమ్స్ విస్తరణకు రూ.1,571 కోట్ల నిధుల కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
నిమ్స్ ఆస్పత్రిలో ప్రతి రోజు కొన్ని వేల మంది వైద్యం చేయించుకుంటుంటారు. ఈ నేపథ్యంలో నిమ్స్ విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో నిమ్స్ విస్తరణకు రూ.1,571 కోట్ల నిధులను కేటాయిస్తూ బుధవారం వైద్యారోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నిమ్స్ విస్తరణ ప్రాజెక్టుకు పరిపాలన అనుమతులను ప్రభుత్వం మంజూరు చేసింది. నిధులు కేటాయించడంపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ఆరోగ్య తెలంగాణ కోసం తీసుకుంటున్న చర్యల్లో ఈ నిర్ణయం మరో ముందడుగు అని పేర్కొన్నారు. సిఎం కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

# డిఎ ప్రకటించాలి

- పిఆర్‌సి అనుబంధ జిఒలను విడుదల చేయాలి
- హరీశ్‌రావుకు యుఎస్‌పిసి వినతి
- బదిలీలు, పదోన్నతులకు రంగంసిద్ధం చేస్తున్నాం : మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయి ఉన్న మూడు వాయిదాల కరువు భత్యం (డిఎ)ను వెంటనే ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పిసి) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పిఆర్‌సి సిఫారసు మేరకు ఆర్‌పిఎస్- 2020కి అనుబంధంగా ఇవ్వాల్సిన స్పెషల్ పేలు, కన్వేయన్స్, ఏజెన్సీ అలవెన్సులు, సెలవులు తదితర అంశాలపై సవరణ ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల వేతనాలు ప్రతినెలా మొదటి తేదీన చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి హరీశ్‌రావును బుధవారం హైదరాబాద్‌లో యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, చావ రవి, వై అశోక్ కుమార్, ఎం రవీందర్, టి లింగారెడ్డి, డి సైదులు, ఎస్ యాదగిరి, ఎస్ హరికృష్ణ, ఆర్ మంగ కలిసి వినతిపత్రం సమర్పించారు. ట్రెజరీల్లో పాస్ అయిన సప్లిమెంటరీ వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సెలవు వేతనాలు, జిపిఎఫ్, టిఎస్‌జిఎల్‌ఐ క్లైములు తదితర బిల్లులను టోకెన్ నెంబర్ల వారీగా జాప్యం లేకుండా చెల్లిపులు చేయాలని కోరారు. ఇహెచ్‌ఎస్ పథకాన్ని పటిష్ట పరచి ఉద్యోగులు, ఉపాధ్యాయులందరికీ ఆరోగ్య కార్డులపై నగదురహిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూళ్లు, గురుకుల, కెజిబివి, యుఆర్‌ఎస్, ఎయిడెడ్ తదితర విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు హెల్త్ కార్డులివ్వాలని సూచించారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని కనీసం రూ.ఐదు లక్షలకు పెంచాలనీ, వాటి క్లైముల స్క్రూటినీలో, బిల్లుల మంజూరులో జాప్యాన్ని నివారించాలని కోరారు. ఇంకా ఏడేండ్లుగా నిలిచిన పదోన్నతులు, ఐదేండ్లుగా జరగని బదిలీల గురించి ప్రస్తావించి కాలపట్టికను విడుదల చేయటానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 'బదిలీలు, పదోన్నతులకు రంగంసిద్ధం చేస్తున్నాం. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విధించిన ఆర్థిక ఆంక్షల ఫలితంగా డిఎ ప్రకటన, జీతాల చెల్లింపు ఆలస్యవుతున్నాయి. ఆర్థిక పరిస్థితి క్రమంగా మెరుగు పరచుకుని అన్ని సమస్యలనూ పరిష్కారం చేసుకుందాం. ఆరోగ్య కార్డులపై నగదు రహిత వైద్యం అందరికీ ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాం. అయితే ఉద్యోగుల నుంచి చందా ఎంత మినహాయించాలనే అంశంపై ఏకాభిప్రాయం లేనందున చేయలేకపోతున్నాం. టిఎన్‌జిఒలు వేతనంలో రెండు శాతం చందా ఇస్తామంటూ రాసి ఇచ్చారు.'అంటూ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారని తెలిపారు. ఉపాధ్యాయుల అభిప్రాయం ఏంటని అడగగా యూఎస్‌పిసి నాయకులు వారికి ఆమోదయోగ్యం కాదని వివరించామని పేర్కొన్నారు. ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలు ఇంతకంటే చౌకగా ఆరోగ్య భీమాను అందిస్తున్నాయని తెలిపారు. సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలనీ, చందా ఎంత ఇవ్వాలో, పథకం విధివిధానాలు ఎలా ఉండాలో చర్చించి నిర్ణయంతీసుకుందామంటూ యూఎస్‌పిసి నేతలు మంత్రికి స్పష్టం చేశారు.

యుఎస్‌పిసి నాయకులతో మంత్రి హరీశ్‌రావు

# జర్నలిజం ఎంతో పవిత్రమైన వృత్తి

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్
- జర్నలిస్టులూ కార్మికులే : ఆర్ సుధాభాస్కర్
- ఎస్‌వికెలో హెచ్‌యుజె ఆరో మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
జర్నలిజం ఎంతో పవిత్రమైన వృత్తి అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో బుధవారం హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ ఆరో మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజ హితం కోసం జర్నలిస్టులు తమ కలాన్ని, గలాన్ని వినియోగిస్తున్నారని కొనియాడారు. వృత్తిలో అనేక సమస్యలుఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. జర్నలిస్టుల సమస్య పరిష్కారానికి సిఎం కెసిఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర చాలా గొప్పదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాంనగర్ చౌరస్తాలో దీక్షలు చేపట్టినట్టు గుర్తు చేశారు. జర్నలిస్టుల అభ్యున్నతికి, హెచ్‌యుజె సంఘం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని

హామీనిచ్చారు. ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో 64 జర్నలిస్టులకు ఇళ్ల ఇచ్చినట్టు గుర్తు చేశారు. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. నవతెలంగాణ ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు కూడా కార్మికులే అన్నారు. ఈ యూనియన్ ట్రేడ్ యూనియన్ కింద రిజిస్టర్ అయిన సంఘం అని పేర్కొన్నారు. యాజమాన్యానికి నొప్పి కలగకుండా రాసే వారు మంచి జర్నలిస్టులుగా ఈ రోజుల్లో చలామణి అవుతున్నారని తెలిపారు. ముఖేష్ అంబానీకి దాదాపు 70 ఛానెల్స్ ఉన్నాయనీ, ఇవన్నీ ప్రభుత్వాలకు అనుకూలంగా పని చేస్తున్నాయని తెలిపారు. ఈ మధ్య కాలంలో అదానీ కూడా మీడియా రంగంలో ప్రవేశించారని చెప్పారు. మీడియా కొద్దిమంది కార్పొరేట్ల చేతిలోకి వెళ్లిందన్నారు. జనం సమస్యలు, బాధలను చూపించకూడదు అని కొన్ని మీడియా సంస్థలు అనుకుంటున్నాయనీ, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ప్రజల బాధలు, సమస్యలను వెలికితీయడానికి జర్నలిస్టులు ముందుకు అడుగేయాలని పిలుపునిచ్చారు.

దేశంలో మీడియాపై తీవ్ర దాడి జరుగుతుందన్నారు. ఉద్యమం చిన్నదైనా ఆ వార్తను హైలెట్ చేయాలన్నారు. జర్నలిస్టు యూనియన్లు వారి సమస్యలతోపాటు రోజు వారి సమస్యలపై కూడా దృష్టి సారించాలన్నారు. మీడియా రంగంలో చాలా ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. సమస్య చిన్నదైనా సరే మొదటి పేజీలో ప్రాధాన్యత ఇచ్చే విధంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజా సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హక్కుల సాధనతోపాటు ఇతర విషయాలపై పోరాడాలన్నారు. పత్రికా స్వేచ్ఛలో మన దేశం 157వ స్థానానికి దిగజారిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, నేషనల్ కౌన్సిల్ సెక్రటరీ ఆనందం, కార్యదర్శులు నర్సింగరావు, పిల్లి రాంచందర్, సలీమ, హెచ్‌యుజె నాయకులు చంద్రశేఖర్, నిరంజన్, రాజశేఖర్, నవీన్, మధుకర్, తదితరులు పాల్గొన్నారు. గ్రేటర్ వ్యాప్తంగా వందల సంఖ్యలో జర్నలిస్టులు ఈ మహాసభలకు హాజరయ్యారు.

**38 మందితో హెచ్‌యుజె నూతన కమిటీ..**

ఈ మహాసభలో హెచ్‌యుజె నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా బి అరుణ్‌కుమార్ (వెలుగు), కార్యదర్శిగా బొల్లె జగదీశ్వర్ (నవతెలంగాణ), కోశాధికారిగా శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పి నాగవాణి (వార్త), ఉపాధ్యక్షులుగా ఎం రమేశ్, జి రేణయ్య, వి కృష్ణయ్య, పి సర్వేశ్వర్‌రావు, బి కాలేబ్, ఎస్ రమేశ్‌బాబు, సిహెచ్ మధుకర్, జి వీరేష్, బి దామోదర్, ఆర్ రవితేజ, జి నవీన్, సాగర్ వనపర్తిలు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా పి బాలకృష్ణ, ఎస్ మాధవరెడ్డి, తలారి శ్రీనివాస్‌రావు, వి కిరణ్‌కుమార్, కె నరసింహ్మ, ఎ ప్రశాంత్, పి లక్ష్మణ్‌రావు, ఎం జీవన్‌రెడ్డి, డి శేఖర్‌లు ఎన్నికయ్యారు. ఈసీ మెంబర్లుగా టి బ్రహ్మయ్య, ఎస్ ప్రవీణ్‌కుమార్, టి రాజేశ్‌కుమార్, ఎం జహంగీర్, పీఎస్ ప్రతాప్, కె వెంకటస్వామి, శ్రీధర్ మురహరి, డీఎస్.సుభాష్ కృష్ణ, కె లలిత, మహ్మద్ నిస్సార్, ముత్యాలు, హంసరాజు ఎన్నికయ్యారు.

## అనాధికార లింకులపై క్లిక్ చేయొద్దు

- ఎస్‌బిఐ అధికారి మంజు శర్మ

**హైదరాబాద్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) హైదరాబాద్ లోకల్ హెడ్ ఆఫీసులో బుధవారం కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఆధార్ ఆధారంగా ముఖ గుర్తింపు టెక్నలాజీతో ఆండ్రాయిడ్ ఆధారిత స్మార్ట్ ఫోన్‌తో ఉపయోగంచుకునేలా దీన్ని రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని ఎల్‌హెచ్‌ఒ హైదరాబాద్ పిబిబియు డిజిఎం రవీందర్ గౌరవ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌ఒ హైదరాబాద్ ఎన్‌డబ్ల్యు-1 జిఎం మంజు శర్మ మాట్లాడుతూ.. నూతన సౌలభ్యాన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనాధికర లింక్‌లపై ఎవరూ క్లిక్ చేయకూడదని హెచ్చరించారు. వినియోగదారులు తమ పిన్, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దన్నారు.

రోడ్డుపై బైటాయించిన విద్యార్థులు

## హాస్టల్ వసతి కల్పించాలని విద్యార్థులు ధర్నా

- సికింద్రాబాద్ కళాశాల ఎదుట బైటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సికింద్రాబాద్‌లో ఒయు అనుబంధ కళాశాలైన పిజి కళాశాల వద్ద తమకు హాస్టల్ వసతి కల్పించాలని కోరుతూ బుధవారం యుజి విద్యార్థులు రోడ్డుపై బైటాయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులు హాస్టల్ వసతి లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ క్రమంలో విద్యార్థులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. విద్యార్థి నాయకులు శివకుమార్, వేణు, ఆదిత్య, శివకుమార్, ఇతర విద్యార్థులను అరెస్టు చేసి బేగంపేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ఇబ్రహీంపట్నం, ములుగులో జాకీ గార్మెంట్ ఫ్యాక్టరీలు

- మంత్రి కెటిఆర్ వెల్లడి

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు కొనసాగుతున్నాయి. తాజాగా జాకీ గార్మెంట్ ఫ్యాక్టరీ కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు జాకీ కంపెనీ ప్రతినిధులు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్‌తో సమావేశమయ్యారు. ప్రజల్లో పాపులారిటీ సంపాదించుకున్న ఇన్నర్ వేర్ బ్రాండ్ జాకీ (పేజ్ ఇండస్ట్రీస్) ఇబ్రహీంపట్నం, ములుగులో గార్మెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయబోతుందని బుధవారం కెటిఆర్ ట్వీట్ చేశారు. "ఒక కోటి బట్టలను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా ఈ ఫ్యాక్టరీని నెలకొల్పనున్నారు. దీంతో 7 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. జాకీ కంపెనీకి హృదయపూర్వక స్వాగతం" అంటూ పేర్కొన్నారు.

## ఓటర్ల నమోదులో అక్రమాలను నివారించాలి

- సిఇఒకు టిఎస్‌యుటిఎఫ్ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం ఓటర్ల నమోదులో కొన్ని అవకతవకలు జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందనీ, వాటిని నిరోధించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) డిమాండ్ చేసింది. అర్హులైన ఓటర్లు మాత్రమే నమోదయ్యేటట్టు చర్యలు తీసుకోవాలని కోరింది.

ఈ మేరకు ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) వికాస్‌రాజ్‌ను బుధవారం హైదరాబాద్ టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి కలిసి ఫిర్యాదు చేశారు. ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్వీసు వివరాలను ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనల ప్రకారం పరిశీలించకుండానే అధికారులు కౌంటర్ సిగ్నేచర్ చేస్తున్నారని విమర్శించారు. కోవిడ్ అనంతరం నియామకమైన జూనియర్ ఉపాధ్యాయులను (లోగడ ఏ విద్యాసంస్థలోనూ పనిచేసిన అనుభవం లేకున్నా) కేవలం మూడు నెలల పే స్లిప్స్ ఆధారంగా సర్వీస్ సర్టిఫికెట్లపై కౌంటర్ సిగ్నేచర్ చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలకు భిన్నంగా రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి ఇచ్చిన ఉత్తర్వులు బోగస్ ఓట్ల నమోదుకు అవకాశం కలిగిస్తున్నదనీ, ఆ ఉత్తర్వులను రద్దు చేసి, డిఇఒపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొందరు ఎంఇఒలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఇచ్చిన సర్వీస్ సర్టిఫికెట్ ఆధారంగా ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు నడుస్తున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కొందరు ఓటరుగా నమోదయ్యారని పేర్కొన్నారు. యుపిఎస్ ఉపాధ్యాయులు ఓటరుగా నమోదుకు అర్హులా? కాదా? అనే దానిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. తద్వారా యుపిఎస్‌లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదయ్యే వీలుంటుందని సూచించారు.

ఉన్నత విద్య, సాంకేతిక విద్య కళాశాలల ఉపాధ్యాయుల పేరుతో కొందరు సర్వీసు సర్టిఫికెట్లపై డిజిగ్నేటెడ్ అధికారి (యూనివర్సిటీ రిజిస్ట్రార్) సంతకం లేకుండానే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించినట్టు తెలిసిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఓటర్ దరఖాస్తులన్నింటినీ ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారినే నమోదు చేయాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దరఖాస్తులను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని తెలిపారు. ఈ నెల 23న ప్రచురించబోయే ముసాయిదా ఓటర్ల జాబితాలో ఓటరు పనిచేస్తున్న విద్యాసంస్థ పేరును స్పష్టంగా ప్రకటించాలని సీఈవోకు విజ్ఞప్తి చేశారు. ఓటరు నమోదులో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామనీ, అక్రమాలు జరిగినట్టు గమనిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

## బిజెపి ఓటమితోనే లౌకిక వ్యవస్థల పరిరక్షణ

- సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
బిజెపిని అధికారానికి దూరం చేస్తేనే దేశంలో లౌకిక శక్తుల పరిరక్షణ సాధ్యమవుతుందని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. దేశవ్యాప్తంగా ఆ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నదనీ, వామపక్ష, ప్రజాతంత్ర, లౌకికవాద శక్తులు, ప్రజాతంత్ర, ప్రాంతీయ పార్టీలు ఐక్యంగా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ను నిలువరించాలని చెప్పారు.

**In the Court of the Junior Civil Judge:Tadipatri**
**O.S.No.221/2021**
**Between:**
M.Bhagyalakshimi ...Plaintiff
And
Smt. M.Varalakshimi and another ...Defendants

**Notice to Defendant No:1**
D1: Smt. M.Varalakshimi W/o B.Hanumantha Reddy, Manikonda, Hyderabad, Telangana State.
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 28-11-2022వ తేది ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఎ.త్రివేణిరెడ్డి, అడ్వకేటు
అనంతపురం, సెల్: 6305726206.

అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న భోజన పథకం కార్మికులు

## కోడిగుడ్ల బకాయిలు చెల్లించాలి

- రూ.రెండు వేల గౌరవ వేతనం జిఒను ఇవ్వాలి
- తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 9, 10 తరగతుల విద్యార్థులకు సంబంధించిన కోడిగుడ్ల బిల్లుల బకాయిలను చెల్లించాలని, సిఎం కెసిఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన రూ.రెండు వేల గౌరవ వేతన జిఒను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి చక్రపాణి, ఎస్‌వి రమ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని విద్యాశాఖ కమిషనరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కోడిగుడ్లకు అదనంగా నిధులు కేటాయించాలనీ, లేదంటే అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన మాదిరిగానే ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. కార్మికులకు డ్రెస్సులు ఇవ్వాలనీ, వంట షెడ్లు, వంట పాత్రలు, తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ప్రయివేటు సంస్థలకు అప్పగించొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రతి నెలా కార్మికులతో డిఇఒ జాయింట్ మీటింగ్ పెట్టి సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. వంట చేసే కార్మికులకు ప్రమాదబీమా, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

## అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా కొండా నాగేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ నూతన డైరెక్టర్‌గా డాక్టర్ కొండా నాగేశ్వర్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. వివిధ విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు ఆయన్ను ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జాడి ముసలయ్య, బిసి సెల్ డైరెక్టర్ డాక్టర్ చెల్లమల వెంకటేశ్వర్లు, యుసిఐఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కృష్ణ కుమార్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ సీనియర్ రీసెర్చ్ స్కాలర్లు ఆంజనేయులు, వి తిరుపతి సాయిరే, ఈక్షిత్, శ్రీనివాస్ గుండేవార్, దౌలత్, విద్యార్థి నాయకులు దుర్గం శివ, కోట శ్రీనివాస్ పాల్గొన్నారు. కొండా నాగేశ్వర్ మాట్లాడుతూ ఈ రీసెర్చ్ సెంటర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ విసి డి రవీందర్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఈ సెంటర్ ప్రతిష్టను ఉన్నతంగా తీర్చి దిద్దడానికి శాయశక్తులా కృషి చేస్తామని వివరించారు.

## ఐబిఎస్ కేసులో నిందితుడు బెయిల్ పిటిషన్

ప్రజాశక్తి బ్యూరో - హైదరాబాద్

ఐబిఎస్‌లో జరిగిన ర్యాగింగ్ కేసులో నిందితుడైన తన కుమారుడు మైనరనీ, అతనికి ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని నిందితుని తల్లి హైకోర్టు తలుపులు తట్టారు. దీనిపై వివరణ ఇవ్వాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కె.సురేందర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసి విచారణను వాయిదా వేశారు. శంకర్ పల్లిలోని ఐబిఎస్‌లో ఒక విద్యార్థిని ర్యాగింగ్ చేశారనే అభియోగాలపై పోలీసులు పది మందిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కొట్టడం, ర్యాగింగ్, లైంగిక వేధింపులకు పాల్పడినట్లుగా వారిపై కేసు నమోదైంది. ఆ పది మందిలో ఒక నిందితుడి వయసు 17 ఏండ్లనీ, అతను తన కుమారు డనీ, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అతడి తల్లి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

# మహానగరం హరితమయం

- అర్బన్ ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో 4.50 కోట్ల మొక్కలు
- పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణం
- అందరికీ అనువైన ఆవాసప్రాంతం
- హెచ్ఎండిఎ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరానికి మణిహారంగా ఉన్న 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్ఆర్) మొత్తాన్ని హెచ్ఎండిఎ అర్బన్ ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో పచ్చహారంగా అభివృద్ధి చేశారు. నగరంలో ఎటుచూసినా పచ్చని చెట్లు, పార్కులతో హైదరాబాద్ మహానగరం ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. ఒఆర్ఆర్‌పై నుంచి వెళ్లే వాహనదారులకి మంచి అనుభూతిని జ్ఞాపకంగా మిగుల్చుతోంది. ముఖ్యమంత్రి కెసిఆర్ మానస పుత్రికగా చేపట్టిన తెలంగాణకు హరితహారం అమలులో హెచ్ఎండిఎ ముందుంది. పురపాలక శాఖ మంత్రి కె తారకరామారావు ఆదేశాల మేరకు నగరాన్ని అత్యంత నివాసయోగ్య ప్రాంతంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతోంది. అందులో భాగంగా హెచ్ఎండిఎ ప్రతియేటా వివిధ ప్రాజెక్ట్స్ కింద కోట్లాది మొక్కలను నాటించి, సంరక్షిస్తోంది. సొంత నర్సరీల ద్వారా నగరంలోని పలు ప్రాంతాలను లంగ్ స్పేస్‌లుగా ఆహ్లాదకరంగా అభివృద్ధి చేస్తోంది.

**రూ.289.09 కోట్లతో 4.50కోట్ల మొక్కలు**

హెచ్ఎండిఎ అర్బన్ ఫారెస్ట్రీ ఆధ్వర్యంలో 2022-23 సీజన్‌లో రూ.298.09 కోట్లతో తెలంగాణకు హరితహారం కింద 4.50 కోట్ల మొక్కలను నాటారు. పచ్చదనం అభివృద్ధిలో హెచ్ఎండిఎ అగ్రభాగంలో ఉంది. 71.15 లక్షల మొక్కలను నాటి ఔటర్ రింగ్ రోడ్ (158 కి.మీ.), ఇంటర్‌ఛేంజీలు (457.23 ఎకరాలు), సర్వీస్‌రోడ్, రైల్వే కారిడార్లు మొదలైన వాటితో పాటు ఇంటెన్సివ్ ప్లాంటేషన్ ద్వారా గ్రీన్ కారిడార్‌ను అభివృద్ధి చేసింది. మొక్కలకు నీరందించేందుకు ఒఆర్ఆర్‌లో బిందు సేద్యం పరికరాలు అమర్చారు. బిందు సేద్యం పరికరాలు స్కాడా సాఫ్ట్‌వేర్ ఆధారిత ఆటోమేషన్‌పై పని చేస్తున్నాయి. ఈ పద్ధతిని పాటించడంతో ఒఆర్ఆర్‌లో డ్రిప్ ఇరిగేషన్‌కు రూ.5.09 కోట్లు ఆదా అవుతోంది. రూ.116.62 కోట్లతో హెచ్ఎండిఎ పరిధిలో ఉన్న 14708.24 ఎకరాల విస్తీర్ణంలో (16) ఫారెస్ట్ బ్లాక్‌లలో అర్బన్ లంగ్ స్పేసెస్‌గా గ్రీనరీని అభివృద్ధి చేస్తోంది. 16 రిజర్వ్ ఫారెస్ట్ పార్కుల్లో, ఆరు పార్కులు ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. హెచ్ఎండిఎ పరిధిలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, ఆర్‌అండ్‌బి రోడ్లు, హెచ్ఎండిఎ రోడ్ల వెంట సెంట్రల్ మీడియన్-మల్టీ లేయర్ అవెన్యూ ప్లాంటేషన్లు 672.5 కిలోమీటర్లు, అవెన్యూ ప్లాంటేషన్‌లు 269.8 కిలోమీటర్లను అభివృద్ధి చేశారు.

2022-23 సీజన్‌లో ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఐదు కోట్ల మొక్కలను 42 నర్సరీలలో పెంచారు. హెచ్ఎండిఎకు చెందిన తెల్లాపూర్ నర్సరీ రాష్ట్రంలోని ఉత్తమ నర్సరీలలో ఒకటిగా గుర్తింపు పొందింది. హెచ్ఎండిఎ పరిధిలోని 14 సరస్సుల్లో గ్రీనరీని అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడం వల్ల సేదతీర్చే ఆహ్లాదకర ప్రాంతాలుగా రూపొందాయి. వాటిలో ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఎన్‌టిఆర్ గార్డెన్, సంజీవయ్య పార్క్, నెక్లెస్ రోడ్ సహా 39 అర్బన్ పార్కులను అర్బన్ లంగ్ స్పేస్‌లుగా అభివృద్ధి చేశారు. తద్వారా యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్, అర్బోర్ డే ఫౌండేషన్ వారు ట్రీ సిటీ అవార్డు అందించారు. హైదరాబాద్‌కు ట్రీసిటీ అవార్డు రావడం ఇది రెండోసారి. 2020 సంవత్సరానికి మొదటి అవార్డు, 2021 సంవత్సరానికి రెండో అవార్డు లభించింది. పచ్చదనం పెంపుదలకు ప్రభుత్వం చేస్తున్న కషికి లభించిన పురస్కారమిది. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా 2021 నివేదిక ప్రకారం దేశంలో ఒక దశాబ్దంలో 48.66 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అత్యధిక గ్రీన్ కవర్‌ను పొందిన మెగా నగరాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంది.

## నేటి నుంచి ఎంసెట్ బైపిసి తుదివిడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి బి ఫార్మసీ, ఫార్మ్-డీ, బయోటెక్నాలజీ, ఫార్మా సూటికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎంసెట్ బైపిసి విద్యార్థులకు ఈ నెల 17వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ నవీన్ మిట్టల్ బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 17న ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలనీ, హెల్ప్‌లైన్ సెంటర్లలో ధ్రువపత్రాల పరిశీలనకు వెళ్లేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 18న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. అదే నెల 17 నుంచి 19 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముంటుందని వివరించారు. ఈ నెల 22న తుదివిడత కౌన్సెలింగ్‌లో అభ్యర్థులకు సీట్లు కేటాయి స్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం https://tseamcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

## మండల కమిషన్ సిఫారసులు ముందుకు రాలేదు

- మాజీ ఎంపి వి.హనుమంతరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశానికి ఒబిసి ప్రధాని అయినందుకు ఎంతో సంతోషపడ్డామనీ, మోడీ అధికారంలోకి వచ్చాక మండల కమిషన్ సిఫారసులు ముందుకు రాలేదని మాజీ ఎంపి వి హనుమంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిదేండ్ల కాలంలో ఒక పని కూడా చేయలేదని విమర్శించారు. క్రిమిలేయర్ ఎత్తేయలంటూ ఒబిసి పార్లమెంట్ సభ్యులుగా ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నామనీ, కానీ ఇంత వరకు తొలగించలేదని చెప్పారు.

# గిరిజన యోధులకు ఆ శాఖ నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జన జాతీయ గౌరవ దినోత్సవాలలో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖలో పలు గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గిరిజన సహకార సంస్థ చైర్మెన్ వాల్యా నాయక్, గిరిజన ఆర్థికాభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ ఇస్లావత్ రామచందర్ నాయక్, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నత అధికారులు తెలంగాణ గిరిజన స్వాతంత్ర్య సమరయోధులైన రాంజీ గోండ్, కుమ్రం భీమ్, బంజార గురువు సంత్ సేవాలాల్, గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గిరిజన చిత్రాలు, దారు, లోహ శిల్పాలు, ఎంబ్రాయిడరీ మొదలైన హస్తకళల ప్రదర్శనను తిలకించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ఆంధ్ర, గోండ్, తోటి, పర్ధాన్, కోయ, లంబాడీ, కోలామ్ మొదలైన గిరిజన తెగలకు చెందిన పలు కళాకారుల బృందాలు తమ తమ సాంస్కృతిక కళలను ప్రదర్శించాయి. మేడారం జాతర చైర్మన్ కొర్నిబెల్లి శివయ్య ఆధ్వర్యంలో రూపొందించిన అరుదైన కోయ ధర్మ స్తంభాన్ని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగు గారి సూచనల మేరకు నెహ్రూ శతజయంతి గిరిజన మ్యూజియంలో ప్రతిష్టించారు. కార్యక్రమంలో భాగంగా తెలంగాణ గిరిజన సమరయోధుడు కుమ్రం భీమ్ వారసుడు కుమ్రం సోనేరావు, గిరిజన పద్మశ్రీలు కనక రాజు, సకినె రామచంద్రయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సాంస్కృతిక శిక్షణ పరిశోధన సంస్థ సంచాలకులు విట్టా సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శంకర్, జిసిసి జిఎం శ్రీల సీతారామ్ తదితర ఉన్నతాధికారులు, ఆహ్వానితులు పాల్గొన్నారు.

## సిఎం అభద్రతాబావంతో మాట్లాడారు : మల్లు రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన కుమార్తె కవితను బిజెపిలోకి రావాలని అడుగుతున్నారంటూ సిఎం కెసిఆర్ అభద్రతా భావంతో మాట్లాడారని పిసిసి ఉపాధ్యక్షులు మల్లు అన్నారు. గవర్నర్ ఫోన్ ట్యాపింగ్ జరిగిందని చెబితే నమ్మలేదనీ, సిఎం మాటలతో అది నిజమని తేలిందన్నారు. పార్టీ మారమని అడిగితే చెప్పుతో కొట్టాలని అంటున్న కెసిఆర్... 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఎలా విలీనం చేసుకున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలను భయపెట్టడానికే సమావేశం నిర్వహించారా? అని ప్రశ్నించారు.

# సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాంతి భద్రతల పరిరక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సత్వరం సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతుందని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నూతనంగా నిర్మించిన కుమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ రూరల్, రెబ్బెన పోలీస్‌స్టేషన్లను బుధవారం వారు ప్రారంభించారు. కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వాంకిడి, కౌటాల, పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్ శిలాఫకాలను ఆవిష్కరించి వర్చువల్ ద్వారా నూతన పోలీస్‌స్టేషన్ భవనాలను ప్రారంభించారు. అంతకుముందు హరితహారం కార్యక్రమంలో భాగంగా రూరల్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో మంత్రులు మొక్కలు నాటారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లోని అన్ని గదుల్లో కలియతిరిగారు. పోలీస్‌స్టేషన్‌లో నిర్మించిన ఎస్‌హెచ్ఒ గదిలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మహిళా ఎస్ఐ సోనియాను కుర్చీలో కూర్చోబెట్టి అభినందించారు. స్టేషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ కమ్ వెయిటింగ్ హాల్, ఎస్‌హెచ్ఒ, రైటర్ రూమ్, ఇంటర్వ్యూ గది, కమ్యూనికేషన్ రూమ్, సీసీ కెమెరాలను మంత్రులు, డిజిపి మహేందర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం సమావేశంలో హోంమంత్రి

పోలీస్ స్టేషన్లను ప్రారంభిస్తున్న మంత్రులు

మహమూద్ అలీ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి కెసిఆర్ అభివృద్ధితో పాటు పోలీస్ వ్యవస్థ ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రజల సౌకర్యార్థం ఖర్చుకు వెనుకాడకుండా నూతన భవనాలను మంజూరు చేస్తున్నారని తెలిపారు. కెసిఆర్ దిశానిర్దేశంలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నడుం బిగించిందని చెప్పారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా ఉపయోగించుకోవడం ద్వారా సమస్యల పరిష్కారం కోసం పోలీసులు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టపరిచారని, వేలాది పోలీస్ పోస్టులను భర్తీ చేశారని వివరించారు.

అనంతరం కోయవాగు గ్రామపంచాయతీ పరిధిలో గల బల్లలలో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన మైనారిటీ బాలుర పాఠశాల, కళాశాల భవనాలను మంత్రి మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభించారు. ఇటీవల కూలిన అందవెల్లి పెద్దవాగు బ్రిడ్జిని మంత్రులు పరిశీలించారు. వంతెన మరమ్మతులకు పనిచేయని పక్షంలో రోడ్డు భవనాల శాఖ మంత్రితో మాట్లాడి నూతన వంతెన మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రులు పరిశీలించారు.

**కార్యాలయ పనుల పరిశీలన**

డిజిపి మహేందర్‌రెడ్డి తెలంగాణ పోలీస్ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్‌తో కలిసి ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనులు పూర్తయితే సిఎం పర్యటన ఉంటుందన్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో నిర్మిస్తున్న డీపీఓ కార్యాలయాలు ఒకే రకంగా ఉండే విధంగా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, ఆయన ఆలోచన మేరకు ఒకే రకమైన కార్యాలయాలు నిర్మించినట్టు వివరించారు.

# లక్ష్యం గొప్పగా.. కొనుగోళ్లు చప్పగా..

- అంతంత మాత్రమే కొనుగోలు కేంద్రాలు
- రోడ్లపై ధాన్యం ఆరబోసి రైతుల వెతలు
- ఆకాశం మేఘావృతమైతే ఆందోళన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఖాళీ ప్రదేశాన్ని చూసి ఫ్లెక్సీ పెట్టి కేంద్రాలను తెరిచినట్టు చెబుతున్నా.. కొనుగోళ్ల మాత్రం మొదలుపెట్టకపోవడంతో సమీపంలోని మిల్లులు, దళారులను రైతులు ఆశ్రయిస్తున్నారు. రోడ్ల వెంబడి ధాన్యం ఆరబోసి పగలూ రాత్రి కాపలా కాస్తున్నారు. ఆకాశం మేఘావృతమైతే ఆందోళనతో ధాన్యాన్ని ఒకచోట పోగుచేయడం.. తిరిగి దాన్ని ఆరబోయడం నిత్యప్రయాసగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 506 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. తదనుగుణంగా ఏర్పాట్లు, కొనుగోళ్ల మాత్రం చేపట్టలేదు.

ఖమ్మం జిల్లాలో 220 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

రోడ్డుపై ధాన్యం ఆరబెడుతున్న రైతులు

నెలకొల్పాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రేడ్ రకం క్వింటాల్ మద్దతు ధర రూ.2,060గా నిర్ధారించారు. మొత్తం జిల్లాలో 1,17,318 హెక్టార్లలో వానాకాలం వరి సాగు చేశారు. హెక్టార్‌కు 5.683 మెట్రిక్ టన్నుల చొప్పున 6,66,768 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. దీనిలో స్థానిక అవసరాలకు 1.96 లక్షల మెట్రిక్ టన్నులు, విత్తనాలకు 40వేలు, మిల్లులకు 50వేలు పోగా మొత్తం 3.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో నవంబర్‌లో 1.70 లక్షలు, డిసెంబర్‌లో 1.82 లక్షలు, జనవరిలో 67వేల మెట్రిక్ టన్నుల చొప్పున కొనుగోలు చేయాలని అంచనాలు వేశారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 24, ఐకేపీ (డీఆర్‌డీఏ) ద్వారా 48, పీఏసీఎస్‌లు 144, అగ్రికల్చర్ మార్కెట్‌లు 4 మొత్తం 220 కేంద్రాల ద్వారా కొనుగోళ్ల జరపాలని నిర్ణయించారు. అంతా బాగానే ఉన్నా నవంబర్ అర్ధభాగం పూర్తయినా కొనుగోలు లక్ష్యం 1.70 లక్షల్లో పిరికెడు కూడా కొనుగోలు చేయలేదని రైతు సంఘాలు అంటున్నాయి.

**గోడు వెళ్లబోసుకుంటున్న రైతులు...**

కూసుమంచి మండలంలోనే నాణ్యమైన వరి పండించే గ్రామం జక్కేపల్లి. ఈ గ్రామ రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. 'ధాన్యం నూర్పిడి చేసి అమ్మకానికి సిద్ధంగా ఉన్నా కొనుగోలు కేంద్రాలు తెరుచుకోలేదు. గతం కంటే సన్నరకానికి ఈసారి మంచి గిరాకీ ఉన్నా.. సమయానికి కేంద్రాలు తెరవకపోవడంతో అమ్ముకోలేకపోతున్నాం. గతంలో జక్కేపల్లి సహకార కేంద్రం ద్వారా రికార్డు స్థాయిలో కొనుగోళ్ల జరిగాయి. కానీ ఈ సీజన్‌లో కేంద్రాన్ని ప్రారంభించకపోవడంతో అమ్ముకోలేకపోతున్నాం. కొనుగోలు కేంద్రం ప్రారంభించమని కలెక్టర్ విపి గౌతమ్, అదనపు కలెక్టర్ మధుసూదన్ చెప్పినా గోనెసంచులు, లారీల కోసం ఎదురుచూడాల్సి వస్తుందని, ప్రయివేటు వ్యాపారులకు అమ్మితే క్వింటాకు ఐదు కిలోల చొప్పున తరుగు తీస్తున్నారు.

రకరకాల కొర్రీలు పెడుతున్నారు. ఇదిగో ఇలా రోడ్ల పొడుగుతా ఆరబెట్టి.. మబ్బులు పడితే పోగు చేయలేకపోతున్నాం. పగలూరాత్రి కాపలా కాయలేక పోతున్నాం..' అంటూ గుర్వాయిగూడెం రైతు ఎస్.గోవిందరెడ్డి, పాలేరు రైతు దాసరి శ్రీనివాసు, గట్టు సింగారం రైతు సీతారామిరెడ్డి, రైతు సంఘం నాయకులు శీలం గురుమూర్తి వాపోయారు.

**కొనుగోళ్లు ప్రారంభించాం.. - మధుసూదన్, ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్**

ధాన్యం ఇప్పుడిప్పుడే వస్తోంది. కొనుగోళ్లు ప్రారంభించమని నిర్వాహకులకు సూచించాం. జిల్లాలో 220 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే కొన్నిచోట్ల తెరుచుకున్నాయి. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి గింజా కొంటాం.

## రాజ్ భవన్‌లో జన్ జాతీయ గౌరవ్ దివస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజనుల హస్త కళా ప్రదర్శనలతో హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో బుధవారం జన్ జాతీయ గౌరవ్ దివస్‌ను ఘనంగా నిర్వహించింది. రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ... ఆదివాసీల, గిరిజనుల సాధికారత కోసం సుస్థిర ప్రణాళికను రూపొందించాలని అధికారులకు సూచించారు. విద్యతో పాటు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు.

పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యమని చెప్పారు. గిరిజనుల సంక్షేమం కోసం రాజ్ భవన్ గట్టిగా ప్రయత్నిస్తుందని తెలిపారు. మరో ఆరు మారుమూల గిరిజన ఆవాస ప్రాంతాలను దత్తత తీసుకుంటున్నట్టు ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధులు బిర్సా ముండాకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్, అధికారులు, గిరిజన కళాకారులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## 70 ఏళ్ల వయసులో వరల్డ్ రికార్డ్

- డాక్టర్ కృష్ణారెడ్డి ఘనత

ప్రజాశక్తి - కల్చరల్

డెబ్బై ఏళ్ల వయసులో డాక్టర్ ఎద్దుల కృష్ణారెడ్డి మూడోసారి వరల్డ్ రికార్డ్ సాధించారు. జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి ఎస్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సైదాబాద్‌లోని వివేక్ హాస్పటల్ నుంచి ట్యాంక్ బండ్ వద్ద ఉన్న వివేకానంద విగ్రహం వరకు తొమ్మిది కిలోమీటర్ల దూరాన్ని 83 నిమిషాల్లో నడిచి రికార్డు సృష్టించారు. కృష్ణారెడ్డి నడక యాత్రను జైళ్ళ శాఖ శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి, జైలర్ రత్నం జెండా ఊపి ప్రారంభించారు. 2021 ఆగస్టు 8 తేదీన భారత స్వాతంత్ర స్వర్ణోత్సవాల సందర్భంగా 75 టైల్స్‌ను తన కిక్కుతో మూడు నిమిషాల 40 సెకండ్లలో పగలగొట్టి కృష్ణారెడ్డి వరల్డ్ రికార్డు సాధించారు. వివేకానంద జన్మదిన సందర్భంగా 2021 నవంబర్ 28వ తేదీన మేకుల బల్లపై పడుకుని 159 షాబాద్ బండలను ఛాతిపై పగలు కొట్టించుకుని రికార్డు నెలకొల్పారు.

## రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తం

- కిసాన్ కాంగ్రెస్ నేత కోదండరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఏర్పడిన తర్వాత రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి చెప్పారు. రికార్డులు సరిగా లేకుండా చేసిందని విమర్శించారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో భూరికార్డులు సర్వే చేయాలని నిర్ణయించామని గుర్తు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. భూముల సర్వే కోసం కేంద్రం నుంచి ముఖ్యమంత్రి డబ్బులు తెచ్చుకున్నారనీ, ఎక్కడ కూడా ఇంత వరకు సర్వే చేయలేదని విమర్శించారు.

మరోవైపు ఎన్నికల కోసం ముఖ్యమంత్రి హడావిడిగా చేస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో జులై ఒకటి నుంచి భూసర్వేను నిర్వహించబోతున్నారని గుర్తు చేశారు. విదేశాల్లో దివాళా తీసిన ఓ కంపెనీకి ధరణి నిర్వహణను అప్పగించిందన్నారు. పోడు భూములపై ఇంత వరకు నివేదిక బయటకు రాలేదని విమర్శించారు.

## ఫోన్లను ట్యాపింగ్ చేయిస్తోంది కెసిఆరే : బండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బ్రోకర్ల కాల్‌లిస్టు బయటకు తీయిస్తే సిఎం కెసిఆర్ నాటకం బట్టబయలు అవుతుందనీ, ఇజ్రాయిల్ టెక్నాలజీతో ఫోన్లను ట్యాపింగ్ చేయిస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇన్ని రోజులు గడిచినా ఆ నలుగురు ఎమ్మెల్యేలను ఎందుకు బయటకు రానిస్తలేడో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిఎంకు దమ్ముంటే దక్కన్ కిచెన్ హోటల్, ఫాంహౌజ్, ప్రగతి భవన్‌లోని సిసి పుటేజీలను సేకరించి విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. కెసిఆర్ ముందస్తుకు వెళ్లడంలేదని చెప్తే ముందస్తుకు సిద్ధమవుతున్నట్టేనని చెప్పారు. 37 మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్న మిమ్ముల్ని ఏం చేయాలని కేసీఆర్‌ను ప్రశ్నించారు. ఆయా ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికల్లోకి వెళ్లే దమ్ముందా? అని సవాల్ విసిరారు. మునుగోడులో ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించిన నీచుడని విమర్శించారు. సీట్ల కోసం, పోస్టింగుల కోసం బ్యూరోక్రసీ సిఎం కాళ్ళ మొక్కడం దారుణమన్నారు.

## మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే..

- ఆరోగ్యానికి ల్యాండ్ మార్క్ 'మిల్లెట్ హౌస్'
- మొలకెత్తిన చిరు ధాన్యాలతో ఉత్పత్తుల తయారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచి ఆరోగ్యం.. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా తక్కువ ఖర్చుతో ఆహారం అందిస్తోంది 'మిల్లెట్ హౌస్'.. మొలకెత్తిన చిరుధాన్యాలతో ఉత్పత్తులు తయారు చేస్తోంది. బీపీ, షుగర్, గ్యాస్టిక్, కీళ్లనొప్పులు, ఉబకాయం, పైల్స్, జీర్ణక్రియ సమస్యలు లేదా నీరసం, థైరాయిడ్, అస్తమా, జుట్టు రాలడం.. తదితర అనారోగ్య సమస్యల నుంచి బయటపడటానికి.. పరిష్కారానికి సంజీవినిగా 'మిల్లెట్ హౌస్' కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. తక్కువ ఖర్చుతో మంచి ఆరోగ్యం మీ సొంతం అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో రెండేళ్లలో దాదాపు 30 లక్షల మంది వినియోగదారులు 'మిలెట్ హౌస్' ఉత్పత్తులను ఉపయోగించి సత్ఫలితాలు పొందారు. 'మిల్లెట్ హౌస్' దేశ వ్యాప్తంగా పేరు ప్రతిష్టలను సొంతం చేసుకుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో 'మిల్లెట్ హౌస్' ఏర్పాటై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని మూడవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో ఆ సంస్థ ఎండి కార్తీక్ బుధవారం దానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు.

ఉత్తమ రైతు అవార్డుల గ్రహీత తన తండ్రి డాక్టర్ మల్లూరు నాగరాజుతో కలిసి 2014లో కర్ణాటకలో 'మిలెట్ హౌస్'ను ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం ఆగస్టు, 2020లో రెండు తెలుగు రాష్ట్రాల్లో 'మిల్లెట్ హౌస్'ను ప్రారంభించగా, దాదాపు 30లక్షల మంది తమ ఉత్పత్తులను వినియోగించారని, సత్ఫలితాలు సాధించారన్నారు. దేశంలోనే తొలిసారిగా నానబెట్టి మొలకెత్తిన జొన్నలు, రాగులు, బఠాణీ, గుమ్మడి గింజలతోపాటు తదితర చిరుధాన్యాలతో 'మిల్లెట్ హౌస్ మాల్ట్' ఉత్పత్తులను తయారు చేస్తున్నామన్నారు. గోధుమలు, చెక్కర, సోయా లాంటివి ఉపయోగించకుండా సహజసిద్ధంగా పూర్తి ఆర్గానిక్ పద్ధతిలో తయారు చేస్తున్నామని వివరించారు.

వీటి నుంచి ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రావని చెప్పారు. ముఖ్యంగా ఇమ్యూనిటీ పెంపొందుతున్నారు. రెండేళ్లపై వయసు గల వారు తమ ఉత్పత్తులను వినియోగించొచ్చన్నారు. డాక్టర్ ఖాదర్ వలీ మద్దతు లేదని కొందరు చేస్తున్న ఆరోపణలో నిజం లేదన్నారు. 'మిల్లెట్ హౌస్ మాల్ట్' ఉత్పత్తులు అన్ని మండల కేంద్రల్లోని ఆర్గానిక్, కిరాణదుకాణాలు, మెడికల్ షాపుల్లో అందుబాటులో ఉంటాయన్నారు. ఆన్‌లైన్‌లో సైతం ఆర్డర్ చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో 'శ్రీ చరణ కమ్యూనికేషన్స్' ఎండీ గుప్తాతోపాటు 'మిల్లెట్ హౌస్ మాల్ట్' ప్రతినిధులు కుమార్, గుప్తా, రాజ్‌కుమార్, సన్నీ ప్రసాద్, శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.